వి.వి. సత్యప్రసాద్

# ఒక అమ్మాయిగారి పెళ్ళి



ఆనగనగా ఒక అమ్మాయి. మన కథాగమనం కోసం ఆ అమ్మాయికి ముచ్చటగా పార్వతి అనిపేరు పెట్టుకుందాం. ఆమె అన్నిటికీ 'అతిలేనితి' అనగా గుణవతి, శీలవతి, వివేకవతి, కృపావతి, కోపవతి, సత్యవతి, పార్వతి. ఆమె అల్లారు ముద్దుగా బొద్దుగా పెరిగింది. ఆడుతూ, పాడుతూ అందరి అమ్మాయిల్లాగే ఏదో కాస్త చదివింది. ఆమె నాన్నగారు హుందాగా ఉంటారు. ఠీవిగా ఉంటారు. మృదువుగా ఉంటారు. ఆయన ఒక రోజున పార్వతిని పిలిచారు. [illegible] నిమురుతూ.

"అమ్మా, బి.ఎ. పరీక్ష పాసయ్యావు. . .ఇక నీకు పెళ్ళి చేద్దామనుకుంటున్నానమ్మా" అన్నారు.

పార్వతి అప్రయత్నంగానే "నాకా. . . పెళ్ళా . . .నాన్నగారూ. . ." అంటూ టెలిగ్రాఫిక్ ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచి, నాన్నగారి వైపు చూడబోయి, చూడలేక, సిగ్గుతో తల వంచుకుని తుర్రున తన గదిలోకి పారిపోయింది.

"హా. . .హా. . .హా. . .పిచ్చి తల్లి" అని నవ్వుకున్నారు ఆయన తృప్తిగా.

పార్వతికి తన గదిలోకి వచ్చినప్పట్నించీ [illegible] బిజీగా వర్క్ చేసేస్తోంది. తన మనస్సు తనలో లేనట్టూ, ఎటో తేలిపోతున్నట్టూ అనిపిస్తోంది. ఏమిటో. . .'పెళ్ళి' అనే మాట వినగానే తనలో ఎంత మార్పు? ఏవేవో ఆలోచనలు. . .కాసేపు అటు దొర్లింది ఇటు దొర్లింది. తనలో కలిగిన పరిణామం తనకే అర్థం కావటం లేదు. తనలో ఎలాంటి పరిణామం కలిగిందో అని అద్దంలో చూసుకుంది. బుగ్గలు కాస్త ఎర్రబడ్డ గుర్తులు కనిపించాయి. బహుశః ఇదే కాబోలనుకుంది—అనుకుని నవ్వుకుంది. అప్పుడే చంద్రుడు అర్జెంటు పనున్నట్టు కిటికీలోంచి తొంగి చూస్తున్నాడు. మల్లెపూలు వెన్నెలతో కలిసిపోయి నవ్వుతున్నాయి. వాటిని రోజూ చూస్తున్నా ఇవాళ ఎందుకో కొత్తగా కనిపి

న్తున్నారు. అసలు తన మనసే పొడ్తూ పోయింది పెళ్ళి మాట విని ఆమెకు కొసేపు పెరట్లోనే ఉంటే చాలా అనిపించింది. పెరట్లో కెళ్ళింది ఆలోచిస్తూంది.

పెళ్ళి. . .ఈ రోజు వరకు పెళ్ళిని గురించి ఆలోచించలేదు. చదువులో పడ్డం వల్ల, ఎవరి ప్రేమలోనూ పడకపోవటంవల్ల, ఈ మాట గురించి తీవ్రంగా ఆలోచించే అవసరం ఏర్పడలేదు ఇంత వరకూ కానీ, ఈ నాడు. . . నాన్నగారు ఆ మాట అనడంతోటే ఏదో ఆనందం. ఏదో ఆహ్లాదం. ఏదో అనుభూతి. ఆమె భావాలన్నీ ఒక పాటలోకి చేర్చి పాడుకుంది.

దూరానా నీలిమేఘాలా. . .
నా లోని కొత్త భావాలా. . .
పూ చేనకా కోటి మురిపాలకా, తొంగి చూచేనా
కిన్నె సరదాలు. . . హోహోహోహోహోయ్. . ."

చాటునుండి విన్న ఆమె అమ్మగారు నవ్వు కున్నారు. "పిచ్చి తల్లికి ఏదొచ్చినా పట్టలేం" అనుకున్నారు నవ్వుకుని.

పార్వతి నాన్నగారు చెప్పిన అట్టే ఆలస్యం చెయ్యకుండానే బహు చక్కటి సంబంధాన్ని కుదిర్చారు. సిరిసంపదలూ పరువు ప్రతిష్ఠలూ ఉన్న కుటుంబంలో కుర్రాడు ఈడూ జోడూ, కుల గోత్రాలూ సరిపోయాయి. చదువుకున్న భార్య వచ్చినందుకు ఆయనకూడా ఎంతో సంబర పడ్డారు. పెళ్ళి బ్రహ్మాండంగా జరిపించారు. వియ్యాలవారి ఉద్దేశాలు సరిసమానంగా ఉన్నాయి కాబట్టి కయ్యాలు అట్టే రాలేదు.

అంతా బాగానే జరిగినా పార్వతి నాన్నగారికి మాత్రం పెళ్ళి పూర్తయి వచ్చినప్పటినుంచీ, ముఖ్యంగా అలకపాన్పు వేడుక జరిగిన దగ్గర్నుంచీ కొంచెం బెంగ కలిగింది. కారణ మేమంటే అతని పాన్పు మీద సరదాగా అలిగినట్టే అలిగి అయినగారు 'నాకో స్కూటరు కావాలి.' అని పేచీ పెట్టాడు. అయినా ఆయన బెంగ పైకి కనపడ నీయలేదు.

పెళ్ళి హడావిడి తగ్గాక అలస్యంగా వెళుతున్న బంధువు లందరూ అర్జంటు పనున్నాయంటూ వెళ్ళి పోతున్నారు. చెరువులో నీళ్ళు ఇంకి పోయినట్టు బంధువు లందరూ ఇంకిపోగా, ఇల్లు ఖాళీగా, ప్రశాం తంగా ఉంది.

ఆ రోజు చంద్రుడు అదే పనిగా కాంతి వర్షాన్ని కురిపించి, ప్రపంచాన్ని వెన్నెల మడుగు చేసేస్తు న్నాడు. క్రింద మల్లె పూలు మేడమీద గది వరకూ తమ సువాసనలు వెడతాయా, వెళ్ళవో అన్నట్టు సాధ్యమైనంతవరకు నిటారుగా నుంచుని, పూర్తిగా విచ్చుకుని, మేడమీద గది వైపు ఆత్రతగా చూస్తు న్నాయి. గొట్టం ద్వారా అల్లుకున్న సన్నజాజి తీవ ఆ రోజు ఎన్నడూ లేనన్ని పూవుల్ని పూచి చేసింది. పరిమళాలు మత్తుగా వీస్తున్నాయి. ప్రకృతి అందంగా ఉండటానికి సాధ్యమైనంత గట్టి ప్రయత్నాలు చేస్తూంది.

ప్రకృతి ఆ రోజు మనోహరంగా ఉండటానికి ఇంత తాపత్రయపడుతున్నా, పార్వతి గొట్టాన్ని ఆనుకుని శూన్యంలోకి చూస్తూ, ఏదో ఆలోచిస్తూ వీటిని లెఖ్ఖ చెయ్యటం లేదు. ఎలా చేస్తుంది మరి? ఆమె కళ్ళల్లోంచి మనస్సు ఎటో ఎగిరి పోతూంది. ఏవో లోకాల్లో విహరిస్తూంది. . ఆ సమయం అలాంటిది.

వెనక నుంచే వచ్చి, మెల్లగా భుజం మీద చెయ్యి వేశాడు పార్వతి భర్త.

"ఏం పార్వతీ, ఏమిటి ఆలోచిస్తున్నావు?" మృదువుగా అడిగాడు.

"అబ్బే... ఏం లేదండీ." కొంచెం తొట్రుపాటు పడుతూ జవాబు చెప్పింది.

"అవును కానీ. . నిన్నొకటి అడగాలనుకుంటున్నా . . . అడగనా?" అన్నాడు గోముగా.

"ఏమిటది? అడగండి." అంది. ఓరగా చూస్తూ.

"నువ్వు పాటలు బాగా పాడుతావట. ఏదో ప్రైజు కూడా వచ్చిందట. . . నేను పాటలంటే చెవి కోసు కుంటాను. . . ఒక పాట పాడవూ?" అన్నాడు అనునయంగా.

"నేనా... పాటా... ఇప్పుడా?" అంది ఆశ్చర్య పోతూ.

"అవును. . . నువ్వు పాడితే నేనూ పాడతాలే. ఏం. . .? నీ పాటని వినకూడదా?" అన్నాడు.

"అబ్బే, అది కాదండి. ఇవాళ ఏదో . . ."

"ఏదో. . .?"

"ఏదో. . .గిలిగింత. . .ఏమిటో వింత. . . ఏమని అందును. . . ఏనా డెరుగను ఇంత పులకింత . . . కంపించే తను వంత. . ." అని పాటం మొదలుపెట్టేసరికి రెండో చరణం అతనుకూడా అందుకున్నాడు. పాట పూర్తయింది. . .మల్లె పూలూ, సన్నజాజి పూలూ తృప్తిగా నవ్వుకున్నాయి. ఇక అక్కడ ఉండటం బాగుండదని చంద్రుడు మబ్బులో దాక్కున్నాడు. తలుపు చాటునుండి విన్న అమ్మ అక్కలు ముసుగు మీద వేసుకున్నారు. తమకిలాగ పాడుకునే అవకాశం మొగుళ్ళివ్వనందుకు ఈర్ష్య పడ్డారుకూడా.

తెల్లారింది. ఆయన బద్ధకంగా ఆవలించి, చేతితో శ్రీకారం చుట్టుకుని, కళ్ళు కద్దుకుని తన పక్కకు చూశాడు. అప్పటికే పార్వతి ఒంటరిగా లేచిపోయింది. . . నవ్వుకుంటూ గడియారం వేపు చూశాడు. ఎనిమిదిన్నర. మేడ మీంచి కింది వైపు పెరట్లోకి చూశాడు. పార్వతి మంచి ఆమ్మాయిలా ముస్తాబై మందారపూలని కోస్తూంది బామ్మగారి పూజ కోసం. గబగబ కిందికి వెళ్ళ టానికి ఉపక్రమించాడు. ఆయన కిందకిదిగి, మందార చెట్టు దగ్గరికి వెళ్ళేలోపుగానే పార్వతి పూల సెజ్జ పట్టుకుని బామ్మగారి దగ్గర కెళ్ళి దేవుడి పటం ముందు బుద్ధిగా కూర్చుంది. ఆయన జాలిగా చూస్తూ ఉండిపోయాడు, చిలిపిగా నవ్వుకుంది.

"అమ్మాయ్. . . అమ్మ వారి మీద ఒక పాట పాడమ్మా" అన్నారు బామ్మగారు.

"జననీ . . . శివకామినీ . . .
జయశుభకారిణి. . . విజయ రూపిణి. . ."
అంటూ అందుకుంది ఒక పాట.


ఆయన పెరట్లో పళ్ళు తోముకోవడానికి ఉపక్రమించాడు. కింద మల్లెపూలూ, పార్వతి కోయగా అందక మిగిలిన మందార పూలూ, వాటి ముందున్న తులసి కోట, కొంచెం దూరంలో దూర్వపాక మీద అనపపువ్వులూ... ఆ ప్రాంతం అంతా మనోహరంగా ఉంది.

ఆయనకి రాత్రి మధుర స్మృతులన్నీ జ్ఞప్తికి వచ్చాయి. ఏమిటో . . ఈ పెళ్ళయిన మూడో రోజునే తన సర్వస్వం మరిచిపోయినట్టుంది. తను ఇన్నాళ్ళూ కన్న కలలు నిజమైనట్టూ, అవుతున్నట్టూ అనిపిస్తూంది. కోరికల్ని సాధించ గలిగినట్టు అనుభూతి పొందారు. నిన్న మొన్నటి దాకా బాధలూ, బరువులూ అనిపించిన తన ఉద్యోగపు సమస్యలు ఇప్పు డేమీ కనిపించటం లేదు. జగమంతా మారిపోయినట్టనిపిం చింది. అవ్యక్తంగానే ఈ భావం పాట రూపం దాల్చింది. . .

"జగమే మారినదీ . . మధురముగా ఈవేళా. . .
కలలూ కోరికలూ. . . తీరినవీ మనసారా..."
అంటూ పాడుకున్నాడు.

"ఏమండోయ్, బావగారూ, అలా పాడుతూ కూచుంటారా. . . లేక మొహం కడుక్కుని కాఫీ కొస్తారా? అయినా పొద్దున్నే ఆ పాట లేమిటండీ?" అంది చిట్టి మరదలు పరిహాసం చేస్తూ.

ఆ ముద్దు మాటలకి నవ్వుకుంటూ, "పాడటం మానేసి కాఫీకివస్తున్నా లేవమ్మా, చిట్టి మరదలా!" అంటూ ఆ అమ్మాయిని దగ్గరకు తీసుకుని ముద్దెట్టు



కున్నాడు.

"ఛీ! ఇదేమిటి? నన్ను ముద్దు పెట్టుకుంటారు?" అనేసి తుర్రున లోపలికి పారిపోయింది.

ఆయన క్షణం సేపు కొయ్యబారి, తేరుకుని పిట్టాల్చి, ముఖం కడిగి, మేడ మీదికి వెళ్ళిపోయాడు తన గదిలోకి.

పార్వతి బామ్మగారి పూజ దగ్గర్నుంచి లేచి, ఏదో పని మీద నాన్నగారి గదిలోకి వెళ్ళింది. నాన్న గారు గదిలో విచారంగా కూర్చున్నారు.

"ఏం నాన్నగారూ, ఒంట్లో బాగా లేదా?" అని అడిగింది.

ఆయన నెమ్మదిగా తల తాటిస్తూ,

"అబ్బే... అది కాదమ్మా... చూడు... నీతో ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. ఒక విషయం మాట్లాడాలి. . ." అన్నారు.

"ఏమిటో చెప్పండి, నాన్నగారూ" అంది.

"చూడమ్మా. ఇంత ఖర్చు పెట్టి ఎంతో దర్జాగా నీ పెళ్ళి చేశాను. ఇప్పటికే బోలెడంత


# మీ పాపయొక్క సున్నితంగావుండే రీతిని కాపాడుకునే తీరు




మీపాప అందరి పాపల్లాంటిది కాదు మరి—అందుకే ఏదో ఒక పౌడర్ కాకుండా, ఓ ప్రత్యేకమైన పౌడర్ కావాలి-అదే జాన్సన్స్ బేబీ పౌడర్.

మీ పాపయొక్క జాలువారే మొగ్గలాంటి మృదువైన వళ్ళంటే మీకు మహా ముద్దు—వంటిపైన ఏ చిన్న కణం పడ్డా అపాకర్యమే. తేమ గనక వంటిపై చేరి పేరుకుంటే మృదువైన ఆ ఒళ్ళు ఒరుసుకుంటుంది, చిరచిరలాడుతుంది.

సున్నితమైన ఆ లక్షణాలకి అనుగుణమై అద్భుతమైనది. జాన్సన్స్ బేబీ పౌడర్. అది మరీ ప్రత్యేకంగా స్వచ్ఛంగా, మృదువుగా, మెత్తగా వుండేలా తయారు చేయబడింది. జాన్సన్స్ బేబీ పౌడర్‌లో మరింతగాగల తడిని పోగొట్టే లక్షణం వలన, ఆ తడిదనం పోతుంది.. దాంతో పాపకు అనువైన అనురాగం అందుతుం... ఇంతకి మీ పాపకి మీ స్పర్శే లోకం. జాన్సన్స్ బేబీ పౌడర్ మీ పాపకు చడ్డీ మార్చే సమయంలో మృదువుగా పొడిగా ఉంచుతుంది—స్నానం చేసిన తర్వాత హాయిగా, కులాసాగా అట్టే బెడుతుంది. అది అనురాగంలాంటిది. మీరు చెంతనే వున్నట్టనిపిస్తుంది ఎప్పుడూ—నిజానికి మీరక్కడ లేకపోయినా సరే.

శిశు సంరక్షణపై చిన్న పుస్తకం ఉచితం. ఇది ఇంగ్లీషులోనే లభిస్తుంది. దీనికోసం కన్స్యూమర్ ఇన్ఫర్మేషన్ సెంటర్, జాన్సన్స్ & జాన్సన్స్ లిమిటెడ్, 30, ఫోర్జట్ స్ట్రీట్, బొంబాయి 400 036, వారికి రాయండి.

జాన్సన్స్* బేబీపౌడర్ చల్లగా పొడిగా సౌకర్యంగా

*Trade Mark © J&J.77

లింటాస్-J&J.9-203 TL

అయింది. అల్లుడుగారికి స్కూటరు ఎలా తేగలను? చెప్పు తల్లీ. స్కూటరు కొనేంత డబ్బు లేదే నా దగ్గర? ఏ ట్రాన్సిస్టరో ఇస్తానని చెప్పమ్మా." అన్నారు.

పార్వతి నవ్వుతూ "ఈ మాత్రానికేనా, నాన్న గారూ, మీకు బెంగ? ఆయన సరదాగా పది మంది, లోనూ అడగకపోతే బాగుండదని అడిగారు కానీ, నిజంగా మీ రివ్వాలని కాదు. నేను చెబుతా లెండి. మీ రేమీ బెంగ పెట్టుకోకండి." అంది నోదార్పుగా.

"ఏమో, తల్లీ. నా పరువు నిలబెట్టి ఇది కాస్త తప్పించు. నీ మేలు మరువలేను" అన్నారు ఒక నిశ్వాస విడుస్తూ.

పార్వతి మేడ మీదకి వెళ్ళింది.

"దేవిగారికి ఇప్పుడు తీరుబడిఅయింది గావోసు" అన్నాడాయన నవ్వుతూ.

"కాబట్టే వచ్చాం" అంది నేల వైపు చూస్తూ, బొటన వేలితో నేల మీద రాస్తూ. . .

"పోనీలే ఇప్పుడైనా తీరికైంది... రా, పార్వతీ" అన్నాడు.

పార్వతి కూర్చుంది. నాన్నగారి బెంగ తాలూకు విషయాన్ని ఎలా కదలేద్దామా అని ఆలోచించింది. మెమ్మదిగా మొదలుపెట్టింది.

"ఏమండీ, నేనంటే మీ కిష్టమేనా?"గోముగా, ఆయన కళ్ళలోకి చిలిపిగా, మూటిగా చూస్తూ అడిగింది.

"అదేమిటి, పార్వతీ నువ్వంటే నా కిష్టం లేక పోడమేమిటి? అపితమైన ప్రేమ" పాపం. అమాయకంగా నిజం ఒప్పేసుకున్నాడు.

"మరయితే నే చెప్పే దొకటి మీరు వినాలి. అప్పుడు మీ రంటే నాకూ అంతే" అంది. . .

ఏదో వ్యవహారం ఉందనుకుని పసి గట్టాడు ఆ సంభాషణ తీరుని బట్టి కొంచెం జాగ్రత్త పడాలను కున్నాడు.

"ఏమిటి నువ్వు చెప్పేది?"

పార్వతి మొదట జంకినా, చెప్పడానికి ఉపక్రమించింది.

"చూడండి... మా నాన్నగారు ఎంతో ఖర్చు పెట్టి ఈ పెళ్ళి జరిపించారా? మరి మీరు ఈ సమయంలో స్కూటరంటే ఎలాగ చెప్పండి?" అంది.

"ఏం తప్పేముంది? ఆటే పాన్పుమీద కోరు కొమ్మన్నారు. అడిగాను. ఇంతకీ ఇవ్వనన్నారా?" కొంచెం గట్టిగానే అన్నాడు.

"అబ్బే, ఇవ్వనంటారుటండి? పాపం, బోలెడు ఖర్చులో ఉన్నారు. ప్రస్తుతం ఆ కోరికనని ఉపసంహరించుకోండి. . . మీ కంతగా కావాలంటే ఏ ట్రాన్సిస్టరో ఇమ్మంటాను" అంది.

"అఖ్కర్లేదు. . . నాకు స్కూటరే కావాలి." అదిరిపోయేలా అరిచాడు.

"అంతేనాండి?"

"అంతే."

"అయితే మీకు స్కూటరు ముఖ్యమా? నేను ముఖ్యమా?" పార్వతిలో స్వభావసిద్ధమైన పౌరుషం పెల్లుబికింది.

"స్కూటరే" అన్నాడు మరింత పౌరుషం ఉట్టిపడేలా.

పార్వతికి కోపం వచ్చింది.

"మీకు స్కూటరు ముఖ్యం కాబట్టే కొని పడేయ్యమంటాను. హాయిగా ఊళ్ళట్టుకుని తిరుగుదురు కాని" అనేసి గుడ్ల నీరు కుక్కుకుంటూ విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

అతను క్షణం సేపు చకితుడై పోయాడు. "అనవసరంగా 'ఆవిడ' మనస్సు నొప్పించానే. . . సరదాకి పౌరుషం చూపిస్తే. . . ఇదేమిటి చెప్మా?" అనుకున్నాడు.

పార్వతికి కోపం రావటం తన కిష్టం లేదు. పార్వతి కోసం స్కూటరే కాదు, ఏదైనా త్యాగం చేయగల ప్రేమ ఉంది అతనిలో. మాటల సందర్భంలో అనేశాడుకూడా. కానీ పార్వతిని కన్నీరు వచ్చేలా బాధించినందుకు లోలోపలే పశ్చాత్తాపపడ్డాడు.

వెంటనే పరుగెత్తుకుంటూ "పార్వతీ! అగు . . .మాట. . ." అని పిలిచాడు. వెనక్కి చూడకుండానే మేడమీద వరండాలో చకచకా నడుస్తోంది.

"అయామ్ సారీ, పార్వతీ. ఇటు చూడు" అన్నాడు. ఆమె చూడలేదు.

"జరా. . . ఠైరో. . ." అన్నాడు భాష మారిస్తేనైనా కొంత సానుకూలం అవుతుందేమోనని. . . అయినా ఆగలేదు.

"ఖుశీ పలక్‌మే ఝూటా గుస్సా
బంద్ పలక్‌మే ప్యార్. . .
జీనా భి ముష్కిల్. . .
మర్నాభి ముష్కిల్. . ." అంటూ ప్రాధేయ పడుతూ పాడటం మొదలు పెట్టాడు.

పార్వతి నవ్వుతూ వెనక్కి తిరిగింది.

"హమ్మయ్య! కోపం చల్లారింది గదా?" అన్నాడు భుజం మీద చేతులు వేసి. . .

"నాకు తెలుసు. . . మీ రిలా దేవుళ్ళాడతారని" అంది నవ్వుతూ.

ఆయన క్షణం సేపు మాట్లాడలేకపోయాడు.

* * *

కార్యక్రమాలన్నీ పూర్తయిన తరవాత పునస్సంధాన ముహూర్తం పెట్టారు. ఆయన ఉద్యోగం చేస్తున్న ఊళ్ళో చక్కని ఇల్లు తీసుకుని, కాపరానికి కావలసిన సరంజామా అంతా సిద్ధంగా ఉంచాడు

ఒక శుభ ముహూర్తాన పార్వతి చేత ఆ ఇంటో కుడి కాలు పెట్టించారు. ఇల్లంతా సర్దుకుని, అన్నీ హంగులు కుదుర్చుకునే సరికి రెండురోజులుపట్టింది. ఇక్కడో మాట చెప్పాలి. ఇల్లు సర్దుతుండగా అలిసి, కాస్సేపు విశ్రాంతి తీసుకుంటూ, "పార్వతీ, మనం బైరాగులు, విరాగులు భయపడే, పిరికి సంసారులు వర్ణించే సంసార మనే సాగరంలో పడ్డాం కదూ?" అన్నాడు. . .

"సంసారం. . . మహా సాగరం. . .

ఈదాలీ ఏకమై ఇద్దరం..." అని వెంటనే అంది.

ఈ పాటని పాడిగిసూ తనూ అందుకుని చివరికి ఎలా ఈదాలో ప్రణాళిక వేసుకున్నారు.

ఉచితము! ఉచితము!

తెల్లమచ్చలు

అన్ని రకాల మచ్చలను, నిరంపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచారము నిమిత్తం ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.

BHARAT AYURVEDASHRAM
P.O. Katri Sarai (Gaya)




మూలశంకకు
శీఘ్రంగా
నమ్మకమైన
దవసా
విరేచనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!

వేసుకుని నవ్వుకున్నారు. నవ్వుకుని పక్కో పర్వడంలో పడ్డారు.

• • •

ఒక రోజున సాయంత్రం ఆయన పెందరాళే ఆఫీసు నుండి వచ్చేసి "పార్వతీ. ఇవాళ బీచ్‌కి వెడదాం . . ."అన్నాడు.

"ఊహూ. . . నేను రానండీ." అంది పార్వతి.

"అదేమిటే? ఏం?" అన్నాడు ఆయన ప్రశ్నార్థకంగా మొహం పెట్టి. . .

"మీ స్నేహితు లెవరైనా చూస్తే నాకు సిగ్గుగా ఉంటుందండీ. నేను రాను. . ."

"ఇదేమిటే? ఉన్నట్లుండి పల్లెటూరి అమ్మాయివై పోయావ్? సిగ్గేమిటి? జోరుగా, హుషారుగా షికారు వెళ్ళడానికి?"

"ఏమో బాబూ నేను రాలేను. . . నాకు సిగ్గు."

"చెలికాడు నిన్నే రమ్మని పిలువ
చేర రావేలా ఇంకా సిగ్గు నీ కేలా?" అంటూ పాడటం మొదలు పెట్టాడు. ఇద్దరూ పాట పూర్తి చేశారు. పార్వతికి సిగ్గు తొలగి పోయింది. 'తోడుగా నడయాడగా' చివరికి బీచ్‌కి వెళ్ళా రిద్దరూ. బీచ్‌లో ఉత్తుంగ తరంగాలతో కోరికల్ని అణుచుకోలేని ఉద్రేకిలా సముద్రం ఉప్పొంగుతూంది. మాటి మాటికీ భూదేవి స్పృశిస్తూ అల్లరి పెడుతూంది. పాపం భూదేవి ఆ సముద్రుడి చిలిపి అల్లరి నంతటినీ సహించి ఎంతో ఓర్పుతోను, సహనంతోను ప్రశాంతంగా ఉండి తన పేరు సార్థకం చేసుకుంటూంది. సముద్రుడి ముచ్చట్లని సూర్యుడు వినోదంగా తిలకిస్తున్నాడు.

పార్వతి, వాళ్ళాయనా సముద్రమూ, భూమీ కలిసిన చోట కూర్చుని, ఆకాశమూ, సముద్రమూ కలిసిన వైపు చూస్తున్నారు. వారిద్దరూ కూర్చున్న వాతావరణం ప్రశాంతంగా ఉంది. సముద్రం ఎంత విసురుగా, ఉద్రేకంగా ఉప్పొంగినా, భూదేవి చూసి చల్లగా వెనక్కి తగ్గిపోవడం వింతగా ఉంది ఆయన మానవులకి ప్రకృతి చాలా విగూఢమైన పాఠాలు నేర్పుతుంది అనడానికి ఇదొక సత్యం.

ఆయన ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ ముగ్ధుడై పోతున్నాడు. పార్వతి మాత్రం ఆయనగారి సౌందర్యాన్ని తిలకిస్తూ ముగ్ధురాలై పోతోంది. ఆయనడి కళ్ళల్లో కనిపించే చిలిపితనం, నిర్మలత్వం ఆమెని ఎంతగానో ఆకర్షించాయి.

"చిలిపికనుల తీయని చెలికాడా.
నీ నీడను నిలుపుకొందురా వలపుల వేడ. . ."
పాట అప్రయత్నంగా వచ్చింది.

పాట పూర్తయ్యాక ఇంటికి వచ్చేశారు.

* * *

రోజులు హాయిగా ఇలా గడుస్తున్నాయి సినిమాలకీ, షికార్లకీ వెడుతూ చక్కగా కాలక్షేపం చేస్తున్నారు. ఒక రోజు ఆ ఊళ్ళో మ్యూజికల్ నైట్ జరగబోతూంది. ఆయన పొద్దున్న ఆఫీస్‌కి వెడుతూ "పార్వతీ. ఇవాళ సాయంత్రం పెందరాళే వచ్చేస్తాను. సంగీత కచేరీకి వెడదాం తయారై రడీగా ఉండు" అన్నాడు.

సాయంత్రం అయింది. ఆయన ఇంతకీ రావడం లేదు." ఎంతకు రాడు నాథుడని ఇంతి గృహాంతర మంచునిల్చి" అని ఆయన ఎప్పుడు వస్తారా అని తెగ ఎదురు చూస్తూంది. ఆరు దాటి అరగంటయింది. అయినా రాలేదు. ఏడు గంటలకే కచేరీ ప్రారంభం చికాకు ఎక్కువైంది. ఏమీ తోచక అటూ ఇటూ పచార్లు చేస్తూంది. ఇంతలో వెనక నుంచి వచ్చి.

"రాననుకున్నావేమో. . . నే
రాననుకున్నావేమో. . . ఆడిన మాటకు, నిలిచే వాడివి


## రామతీర్థ బ్రాహ్మీ ఆయిల్

స్పెషల్ నం. 1 రిజిస్టరు

చుండ్రు, జుట్టు రాలిపోవుటను నివారించే ఒక అమూల్యమైన ఒషధీకృతమైన తలనూనె. ఇది విలువయైన అనేక దినుసులతో శాస్త్రీయంగా తయారుచెయ్యబడినది. మెదడును చల్లబరచి ఆరోగ్యాన్ని అభివృద్ధి పరచి, సుఖనిద్ర నిస్తుంది. శరీర మర్దనకు మిక్కిలి ఉత్తమమైనది. ప్రతి వారికీ అన్ని ఋతువులలోను ఉపయోగమైనది.

పలిచోట్లా లభిస్తుంది

శ్రీ రామ తీర్థ యోగాశ్రమం

దాదర్, సెంట్రల్ రైల్వే, బొంబాయి-400-014. ఫోన్: 442899.



## మిమ్ము పరీక్షించుకొనండి
## మీరే ఉత్తమ బహుమతి గెల్చుకొనవచ్చును



1st Prize
RS.1,000
CASH
and other attractive prizes

2 వ బహుమతి
అఖిల ప్రపంచ ట్రాన్సిస్టర్ లేక జార్జెట్ చీర

3 వ బహుమతి
రు 150/- ల విలువగల పుస్తకాలు



క్రింది ఖాళీలను సరైన మాటలతో పూరించండి

- భారతదేశపు 2 వ ప్రధాన మంత్రి ఎవరు . . . .( నందా/శాస్త్రి
- నేటి భారతదేశపు మిక్కిలి పెద్దపారిశ్రామికులు ఎవరు. . .( టాటా/బిర్లా )
- మిక్కిలి ప్రసిద్ధి పొందిన మాజీస్టేట్ రాణి ఎవరు. . . (విజయరాజెసింధియా/గాయత్రిదేవి)
- భారతదేశంలో మిక్కిలి పెద్ద ఐరన్ స్టీల్ ప్రాజెక్టు ఏది. . .(బొకారో/భిలాయ్/దుర్గాపూర్)
- ఇండియాలో మిక్కిలి పెద్ద కాగితపు మిల్లు ఏది. . . టిటాఘర్/బల్లర్ పూర్ )

ఎంట్రీ సాదా కాగితంమీద లేదా పోస్టుకార్డు మీద పంపవచ్చు. ఎంట్రీ కాపీ లేదు. ఒక కుటుంబం నుంచి ఒక్క ఎంట్రీ మాత్రమే అంగీకరించబడుతుంది.

ఈ ప్రకటన లక్ష్యం మెంబర్లను పెంచుకొనడమే. వచ్చిన జవాబులకు బహుమతులివ్వబడును. ఎక్కువ జవాబులు వచ్చితే జడ్జీల నిర్ణయమే ఖాయం. ఈ విషయంలో జాలీవ్ డిక్లేర్ ఢిల్లీదే.

డ్రా 30-4-78

ఎంట్రీలు పంపునప్పుడు మీ పేరు, అడ్రసు ఇంగ్లీషు, లేక హిందీలో మాత్రమే వ్రాయండి

HIND PUBLICATIONS (w-3)
651/21/B, Nehru Gali, Gandhi Nagar,
Delhi-31.

J/106

కానుకున్నావేమో,' అని పాడుతున్నాడు చెప్ప వలసినదంతా పాటతోనే చెప్పేసింది. పార్వతీ ఇద్దరూ హాయిగా కచేరీకి వెళ్ళారు.

*  *  *

ఎంత ఆనందంగా హాయిగా గడుపుతున్నా చిన్న చిన్న కలహాలనేవి రాకపోతే సంసారానికి అందమే లేదు. ఎన్నాళ్ళని ఒకరి నొకరు పొగుడుకుంటూ ప్రేమించు కుంటూ ఉండగలరు? అందునా పార్వతి వంటి పౌరుషవంతురాలికీ ఆయన లాంటి పౌరుషం ఉన్న వారికీ, ఒకసారైనా చిన్న కలహం లాంటిది వచ్చి తీరుతుంది. ఒకనాడు ఏం జరిగిందంటే...

పార్వతి వేణ్ణీళ్ళు కాచడానికి పొయ్యి అంటించ లేకపోయింది. చాలా సార్లు మనకో బాయిలర్ కొనండీ అని చెబుతూ ఉండేది. ప్రణయ పారవశ్యంలో మరిచిపోతుండేవాడు. ఆ రోజు పార్వతి పొయ్యి అంటిస్తుంటే కిరసనాయిల్ ఎక్కువ వంపేసిందేమో మంట భగ్గుమంటూ ముఖం మీదికి వచ్చేసింది. పాపం ఇలాటివన్నీ కొత్తగా నేర్చుకుందాయె. మంట మీద మంట కొచ్చింది. ఎక్కడ లేని కోపమూ, చిరాకూ, దుఃఖమూ వచ్చాయి. అవన్నీ ఆయన మీద గుమ్మరిద్దామని చరచర రీడింగ్ రూమ్ వైపు వెళ్ళింది.

"ఏమండీ! మీకెన్ని సార్లు చెప్పాలండి? బాయిలర్ ఒకటి కొనిపారెయ్యమని! మనిషికి అంత అశ్రద్ధ అయితే కాపురం ఎలా చేసేదండి? ఏమీ పట్టించుకోని వాళ్ళతో ఎంత ఏడ్చి ఫలితం ఏమిటి? మంచి మనిషి కో మాట అన్నారు!" అంది రుసరుసలాడుతూ.

'అయితే నేను మంచి మనిషిని కానుకో" అన్నాడు నవ్వుతూ. "పరిహాసాలకి వేళా పాళా లేదేమిటి? మీకెన్నిసార్లు చెప్పాను? రేపైనా ఒకటి కొని పారెయ్యండి... లేకపోతే నే నీ పని చేయలేను" అంది గుడ్లురిమి చూస్తూ.

ఆయన కొంచెం కంగారుపడి భయపడినా, టాపిక్‌ని సరదాగా మారుద్దామని "ఇదిగో, పార్వతీ! అలా దెబ్బలాడ కూడదు నువ్వు" అన్నాడు. ఆయన వేళా కోళంగా తీసుకునే సరికి ఆమెకి మరీ మండి పోయింది. కోపం తారస్థాయి నందుకుంది.

"విలన్‌లా మొహం పెట్టుకుని నన్నెందుకు సినీ యాక్టరుతో పోల్చడం?" అనేసింది. ఆయన క్షణంసేపు నివ్వెర పోయాడు. విలన్ అనేసరికి ఆయనకే ఎక్కడలేని కోపమూ వచ్చేసింది. ఆవిడ మీద చిరాకు కల్గింది. తనంత ఏం దుష్టుడని విలన్‌తో పోల్చింది?

ఇక ఏమీ మాట్లాడకుండా గబగబ మేడ మెట్లెక్కి తన గదిలోకి వెళ్ళిపోయి శూన్యంలోకి చూస్తూ ఉండిపోయాడు. ఆయనకి గట్టిగా కోపం వస్తే ఎవరినీ బాధించక అలాగే చేస్తాడు.

ఇక్కడ పార్వతి తన తప్పు తెలుసుకుంది తన తొందరపాటుకి నాలుక కరుచుకొని మరి పశ్చాత్తాప పడింది. "పాపం... సుతిమెత్తని హృదయం ఎంత బాధ పడ్డారు?" అనుకుని జాలిపడింది. అయినా మించిపోయిందేమీ లేదు.

"ఆయనది నవనీతం లాంటి హృదయం. ఇట్టే మార్చెయ్యచ్చు" అనుకుంది. అనుకున్నదే తడవుగా గబగబ మెట్లెక్కింది.

ఎవరి మీద ఎవరికీ కోపాలు వచ్చినా, స్త్రీ పద్దుకుంటేనే సంసారానికి అందం ఉంటుంది. మెట్లమీద అడుగుల చప్పుడు విని ఆయన ధడేల్ మని తలుపు మూసేసుకున్నాడు, కోపంగా. అయినా పార్వతి చలించలేదు. నెమ్మదిగా కిటికీ వారకి చేరింది.

"ఏమండీ! ఇలా చూడండీ" అంది కిటికీలోంచి చూస్తూ.

ఆయన చూడలేదు. అటువైపు తిరిగి ఇంకా అలా ఉండిపోయాడు.

"గోరొంక కెందుకో కొండంత అలక....
అలకలో ఏముందో తెలుసుకో చిలకా..."

అన్న పాటని పూర్తిగా పాడేసింది. వెంటనే తలుపు తీసి పార్వతీ! అంటూ పిలిచాడు ఆ పాటకి ముగ్ధుడై పోయి. ఆవిడ చిన్న తమాషా చేద్దామనుకుంది. చర చరా కిందికి దిగిపోయింది— కోపంగా, ఉడుకుగా "మూతి తిప్పుకుంటూ" కోపం పోయిందని బుజువు చేసుకోడానికి పార్వతీ! నిలు"... అన్నాడు. నిలవ లేదు... "నిలువుమా!" అంటూ...

"నిలువుమా నిలువుమా... నీలవేణీ!
నీ కన్నుల నీలినీడ నా మనసూ నిదురపోనీ"..అని పాడేను.

వివేకం అనేది ఉంటే, సంసారంలో ఎలాంటి ఒడుదుడుకులైనా సర్దుకుపోతాయి. అందుకు వీరిద్దరే సాక్ష్యులు. ప్రణయ లీలా పరవశత్వంలో ఉన్న వీళ్ళిద్దరినీ దేవుడు ఒక కంట కనిపెడుతూనే ఉన్నాడు వీళ్ళ నిర్మలమైన ప్రేమకి చిహ్నంగా ఒక కానుకని ఇద్దామని రెడీగా కూర్చున్నాడు.

పార్వతికి పిక్‌నిక్కి, షికార్లకి భర్తతో కూడా తిరిగే ఓపిక తగ్గిపోయింది. తనకు సహాయంగా ఉండటానికి రమ్మని తన అమ్మమ్మగారికి ఉత్తరం రాసింది. ఆవిడ వచ్చింది కూడా.

పార్వతికి రాను రాను "పుల్లపుల్లని రుచులపై బుద్ధి పోడమె"— నిమ్మకాయ దొప్పలకి, దబ్బకాయ బద్దలకి, ఆ ఇంట్లో గిరాకీ పెరుగుతూంది. చీటికీ మాటికీ బియ్యం తింటూ ఉండటం బియ్యంతో బెడ్డల్ని పోగేయడం ఈయన ఇంకా గమనించలేదు.

నెలలు నిండుతున్నాయి—అటు కాల గర్భంలోను ఇటు ఈవిడ గర్భంలోను. పార్వతిని పుట్టింటికి తీసుకు వెళ్ళడానికి అన్నయ్య వచ్చాడు.

రేపే ప్రయాణం. ఆయనకి అందుబాటులో ఉండేలా అన్నీ అమర్చి, ఆరోగ్యం గురించి హెచ్చరికలు చేసి మళ్ళీ తిరిగి వచ్చేసరికి ఎలా ఉండాలో అన్నీ విడమరిచి చెప్పింది.

పాపం... అన్నీ వింటున్నట్టే ఉన్నాడుగానీ మనసు మనసులో లేదు. ఇన్నాళ్ళుగా మనసున మనసై, బ్రతుకున బ్రతుకై తోడున్న పార్వతిని విడిచి ఉండటం అంటే అంతరాంతరాల్లో పీకుతూనే ఉంది పైకి 'బోల్డ్'గా ఉన్నా లోపల బోల్డు బెంగ పేరుకుపోయింది. నిజానికి ఆమెకీ అలాగే ఉంది కానీ, ఈ మూగ బాధలు తప్పవు.

పార్వతి ప్రయాణమైంది.

"వెళ్ళొస్తానండీ— జాగ్రత్తగా ఉండండి" అంది చిన్నగా నవ్వుతూ, జాలిగా చూస్తూ.

"పార్వతీ! నన్ను విడిచి ఉండగలవా?" అన్నాడాయన ఎంతో బాధగా ఆయన స్థితి కనిపెట్టింది. తను కూడా బాధపడుతూ వెడితే ఆయన మనస్సు మరీ బాధ పడుతుందని అందుచేత కాస్త నవ్వించాలని నిర్ణయించుకుంది.

"పొరబడుతున్నారు. నన్ను విడిచి మీరు పోలేరు. ఇది నిజం! కావాలంటే 'మంచి మనసులు' సినిమాలో సావిత్రిని అడగండి" అంది నవ్వుతూ.

ఆయనకీ నవ్వు వచ్చింది.

"వెళ్ళొస్తా— రైలు బైలుదేరిపోతూంది" అన్నాడు అన్నయ్య. జైలు పోలీసులా పార్వతిని, వాళ్ళ అన్నయ్యని రైలెక్కించి ఇంటికొచ్చి పడ్డాడు. ఇల్లు బోసిపోయి నట్టుంది. ఒకసారి వంటిల్లూ, బెడ్‌రూమూ పరీక్షగా చూశాడు...

ఇదియేనా నా పార్వతి
ముదమారగ నడచినట్టి దివ్యపథం?" అను
కున్నాడు.

ముందుకు పరిగెడుతున్న రైల్లో వెనక్కి పరిగెడుతున్న తలపుల్ని నిశ్చలంగా, మౌనంగా... మననం చేసుకుంటూంది పార్వతి... ఒకసారి తనివి తీరా కడుపు తడువుకుంది...

ఇదియేనా మా ఆయన
ముదమారంగ ఇచ్చినట్టి దివ్యఫలం?
అనుకుంది. *

